క్లుప్తంగా

నేడు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ కిడ్నీ వైద్య నిపుణులు డాక్టర్ దినేషకుమార్‌రెడ్డి కిడ్నీలో రాళ్లు, కిడ్నీ వాపు, కిడ్నీ గడ్డలు, కిడ్నీ అండ్ యూరిన్ ఇన్‌ఫెక్షన్, మూత్ర సమస్యలు తదితర వాటికి వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. ప్రముఖ గుండె జబ్బు నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. చర్మ వ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బొడులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ వై.జి.హర్షవర్ధన్‌రెడ్డి ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. షుగర్ పరీక్షలు నిర్వహించాలనుకునేవారు పరగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 99631 70177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

పేద ప్రజలకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం


కాలనీలో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి

వేంపల్లె : రాష్ట్రంలోని పేద ప్రజలకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిలుస్తోందని వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కుమ్మరాంపల్లె గ్రామంలో జరిగిన వివాహ వేడుకలో ఆయన పాల్గొని అనంతరం గ్రామంలోని ఎస్టీ కాలనీలో ఉన్న సమస్యలపై ఆరా తీశారు. తమ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని జెడ్పీటీసీ దృష్టికి తీసుకెళ్లారు. అందుకు ఆయన స్పందించి మినీ అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మునేష్, ప్రజలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేముల : మండలంలోని రాచకుంటపల్లె, మబ్బుచింతలపల్లె, పెర్నపాడు, పెద్దజూటూరు, వేముల విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8.15 గంటల నుంచి మధ్యాహ్నం 11.15 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రమేష్ తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ల పరిధి గ్రామాల్లోని వినియోగదారులు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యే పరామర్శ

కమలాపురం : స్థానిక వైఎస్సార్ సీపీకి చెందిన పలువురు నాయకులను ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పరామర్శించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు సుధా కొండారెడ్డి తనయుడు యువ నాయకుడు శశిధర్‌రెడ్డి ఇటీవల మృతి చెందారు. శనివారం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి కొండారెడ్డి నివాసానికి చేరుకుని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మీ కుటుంబ సభ్యులకు తాను ఎప్పటికీ అండగా ఉంటానని భరోసానిచ్చారు. అలాగే మున్సిపల్ 10వ వార్డు కౌన్సిలర్ గెంటెం సుగంధి మామ ఇటీవల మృతి చెందారు. వారి నివాసానికి చేరుకున్న ఎమ్మెల్యే కౌన్సిలర్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు అంబటి సురేష్ చిన్నాన్న ప్రసాద్ ఇటీవల మృతి చెందారు. మృతుని కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల, జిల్లా నాయకులు ఉన్నారు.

నేడు అభినందన సమావేశం

కడప రూరల్ : కడపలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం ఉదయం 10.00 గంటలకు ఏపీ ఎన్జీఓల రాష్ట్ర నూతన కార్యవర్గ ఆత్మీయ అభినందన సత్కార సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.శ్రీనివాసులు, బి.రవికుమార్‌లు తెలిపారు. అంతకుముందు ఇరిగేషన్ కార్యాలయం వద్ద నుంచి కోటిరెడ్డిసర్కిల్, సంధ్య సర్కిల్ మీదుగా వైఎస్సార్ జిల్లా పరిషత్ మీటింగ్‌హాలుకు ర్యాలీ ఉంటుందన్నారు. ఈ ర్యాలీ, అభినందన సత్కారానికి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కేవీ శివారెడ్డి తదితరులు హాజరవుతారన్నారు. జిల్లాలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పాల్గొని అభినందన సత్కార సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు.

జామియా మసీదు ఆస్తులను తేల్చాలి

ప్రొద్దుటూరు క్రైం : జామియా మసీదుకున్న పూర్తి స్థాయి ఆస్తులను తేల్చాలని మాజీ స్టేషన్ మాస్టర్ ఖాజామొహిద్దీన్ తెలిపారు. స్థానిక జామీయ మసీదులో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జామియా మసీదుకు చెందిన 7.50 ఎకరాలు సబ్‌డివిజన్లుగా విభజించి ఉందన్నారు. వీటిని జాయింట్ సర్వే నిర్వహించాలని ఆయన డిమాండు చేశారు. ఈ సర్వే చేయాల్సిన బాధ్యత పాత కమిటి అధ్యక్షుడు బేపారి బషీర్‌దేనని చెప్పారు.

రంగ రంగ.. వైభవంగా

● బ్రహ్మారథంకు దారిపొడవునా గోవింద నామస్మరణలు ● ఆకట్టుకున్న చెక్క భజనలు, కోలాటం

పులివెందుల టౌన్ : పట్టణంలో శ్రీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం శ్రీదేవి, భూదేవీ సమేత శ్రీరంగనాథస్వామి రథోత్సవ వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. రథోత్సవ వేడుకలను తిలకించేందుకు పట్టణ పరిధిలోని భక్తులతోపాటు వివిధ ప్రాంతాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి కాయ కర్పూరాలు సమర్పించుకున్నారు. స్వామి వారి తేరు(రథం) కింద గుమ్మడికాయలు పెట్టి పూజాద్రవ్యాలు సమర్పించారు. దారి పొడవునా గోవింద నామస్మరణలతో రథాన్ని కదిలించారు. భక్తులకు ప్రసాదాలు, శీతల పానీయాలను పంపిణీ చేశారు. తేరు ప్రారంభానికి ముందు అర్చకులు కృష్ణరాజేష్‌శర్మ విశేష పూజలు జరిపించారు. ఉభయదారులకు అర్చనలు చేశారు. తేరు ప్రారంభోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ డాక్టర్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ అభిషేక్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లకు బ్రహ్మోత్సవ మర్యాదలతో పూజలు నిర్వహించి ఆలయ చైర్మన్ సుధీకర్ రెడ్డి, ఈఓ రమణలు వారిని శాలువతో సత్కరించి ప్రసాదాన్ని అందజేశారు. అలాగే జూనియర్ సివిల్ జడ్జి పవన్‌కుమార్, డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రాజు,


రథంలో కొలువుతీరిన సతీసమేత శ్రీరంగనాథుడు

ఎస్ఐలు చిరంజీవి, హుసేన్, హాజీవల్లి, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, అంకాలమ్మ ఆలయ చైర్మన్ బ్యాటరీ ప్రసాద్, వివిధ శాఖల అధికారులతో స్వామి వారికి పూజలు జరిపించి మర్యాద పూర్వకంగా సత్కరించి ప్రసాదాలను ఇచ్చారు. రథోత్సవం స్థానిక పూలంగళ్ల సర్కిల్ నుంచి కొనసాగి శ్రీనివాస హాలు రోడ్డు, ముత్యాల వారి వీధి, గుంత బజార్, బంగారు అంగళ్ల మీదుగా తిరిగి పూల అంగళ్ల సర్కిల్‌కు చేరుకుంది. స్థానిక పూల అంగళ్ల సర్కిల్‌లో తిరుణాల ఉత్సవాలు వైభవంగా జరిగాయి. వివిధ ప్రాంతాలనుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు


గోవింద నామస్మరణలతో తేరు లాగుతున్న భక్తాదులు

చోటుచేసుకోకుండా పోలీసులు పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న చెక్కభజన, కోలాటం :

శ్రీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవం(తేరు) తిరుణాల సందర్భంగా స్వామివారి రథం వెంబడి చెక్కభజన కళాకారులు భక్తిగీతాలను ఆలపిస్తూ వేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. అలాగే మైదుకూరు శ్రీసీతా రామ లక్ష్మణ కళాకారుల బృందం కోలాటం అందరిని ఆకట్టుకుంది, తిరుణాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దుకాణాల వద్ద పెద్ద సంఖ్యలో పట్టణ ప్రజలు పాల్గొని బొమ్మలు, ఇతర ఆటవస్తువులను కొనుగోలుచేశారు.


ప్రత్యేక పూజలలో పాల్గొన్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

నేడు అవులస్వామి ఆరాధన

లింగాల : మండలంలోని అంబకపల్లె, ఇప్పట్ల గ్రామాలలో ఆదివారం నిర్వహించే అవధూత శ్రీఅవులస్వామి ఆరాధనోత్సవాలకు ఆలయ కమిటీ వారు ఏర్పాట్లు చేశారు. ఈ ఆరాధనకు కడప, అనంతపురం, సత్యసాయిజిల్లా, కర్నూలు, కర్ణాటక ప్రాంతాల నుంచి భారీగా తరలి వచ్చే భక్తులకు ప్రయాణ సౌకర్యార్థం పులివెందుల, ముదిగుబ్బ ఆర్టీసీ డిపోల నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రూరల్ సీఐ బాల మద్దిలేటి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్ఐ హృషి కేశవరెడ్డి తెలిపారు.

ఉచిత శిక్షణ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగరంలోని సంజీవ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలకు టైలరింగ్, బ్లౌజ్ డిజైనింగ్, జ్యూట్ బ్యాగ్స్, మగ్గం వర్క్, ఎంఎస్ ఆఫీస్, బ్యూటీషియన్ వంటి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి గల మహిళలు ఈ నెల 13 లోపల సంప్రదించాలన్నారు.. మరిన్ని విరాలకు 9396161936 అనే నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

రాజీ మార్గం.. రాజ మార్గం

కమలాపురం : కేసుల పరిష్కారంలో రాజీ మార్గం.. రాజ మార్గం అని, లోక్ అదాలత్‌లో పైసా ఖర్చు లేకుండా కేసులు సత్వరం పరిష్కరించుకోవచ్చని కమలాపురం జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ హరిబాబు తెలిపారు. శనివారం స్థానిక కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఇరువర్గాలు రాజీ ధోరణిలో ఉన్న 592 కేసులు పరిష్కరించినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. ఇందులో 569 క్రిమినల్, 14 సివిల్, 9 బ్యాంక్ కేసులు పరిష్కారం అయినట్లు వారు తెలిపారు. కక్షిదారులను ఉద్దేశించి మెజిస్ట్రేట్ మాట్లాడుతూ రాజీ ధోరణిలో ఉన్న కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకుంటే తర్వాత అప్పీలు చేసుకునే అవకాశం కూడా ఉండదన్నారు. ముఖ్యంగా సమస్యలున్నవారు కక్షిదారులు కక్ష్యలు, కార్పణ్యాలకు వెళ్లకుండా గ్రామ పెద్దల ఎదుట పరిష్కరించుకోవచ్చన్నారు. లేనిపక్షంలో పోలీసులు, కోర్టు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవడం మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు నారాయణరెడ్డి, పుష్పరాజు, మహేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు, మహేష్, కోర్టు, పోలీస్ సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : కక్షిదారులు పోలీస్‌స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరగడం వల్ల కాలయాపనతో


కక్షిదారులతో మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ హరిబాబు

పాటు, డబ్బు వృథా కావడమే తప్ప ఏమీ కాదని.. కక్షిదారులు రాజీ చేసుకుంటే ఉత్తమ మార్గమని జమ్మలమడుగు సివిల్‌కోర్టు జడ్జి ఎస్.బాబాఫకృద్దీన్ అన్నారు. శనివారం ఆయన కోర్టులో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. కక్షలకు పోవడం వల్ల వారి కుటుంబాలు ఇబ్బందులు పడటమే కాక వారి పిల్లలు కూడా చదువులు లేక రోడ్డున పడతారని తెలిపారు. వ్యక్తిగత సమస్యలకు పోకుండా ప్రశాంతంగా జీవించాలని సూచించారు. లోక్ అదాలత్‌లో 706 కేసులు పరిష్కారం కాగా ఒక కోటి 5 లక్షల 16,365 రుపాయలు పరిష్కామైనట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ నాగరాజు, సీఐలు సదాశివయ్య, టి.వి. కొండారెడ్డి, పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజి ఇవ్వాలి

వీరపునాయునిపల్లె : ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజి ఇవ్వాలని సీపీఐ కమలాపురం నియోజకవర్గ సహాయ కార్యదర్శి కొమ్మద్ది ఈశ్వరయ్య అన్నారు. శనివారం మండల కేంద్రమైన వీరపునాయునిపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్ర రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం ఏపీపై చిన్న చూపు చూస్తోందన్నారు. దేశ సంపాదనను అంబాని, ఆదానీలకు నరేంద్రమోదీ దోచిపెడుతున్నాడని విమర్శించారు. దేశ వ్యాప్తంగా ఉన్న ఆదాని ఆస్తులను జప్తు చేసి జాతీయం చేయాలని కోరారు. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ గురించి ప్రస్తావించలేదన్నారు. అంతేకాకుండా కడప బెంగుళూరు రైల్వే మార్గానికి కూడా ఎలాంటి నిదులు కేటాయించకపోవడం, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి భారీగా నిధులు తగ్గించడం దుర్మార్గమన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: గ్రామ పంచాయితీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో గ్రామ పంచాయితీ కార్మికుల సమస్యలపై సదస్సు నిర్వహించారు.

వైభవంగా నాగుల ప్రతిష్ట

పులివెందుల టౌన్ : పట్టణ పరిధిలోని కదిరి రోడ్డు సమీపంలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో శనివారం నాగదేవతల ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు షరీఫ్ ఆధ్వర్యంలో పాడా ఓఎస్డీకి శాలువాలు కప్పి పూలమాలలు వేయగా.. ఆయనకు అర్చకులు తీర్థ ప్రసాదాలను అందించి ఆశీర్వదించారు. అంతకముందు ఆలయంలో గణపతి, సుదర్శన, నాగదేవతల హోమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు


ఆలయంలో ప్రతిష్ఠించిన నాగదేవతలు

తీర్థప్రసాదాలతోపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

విద్యతోపాటు సేవాగుణం అలవరుచుకోవాలి

పులివెందుల టౌన్ : విద్యార్థులు విద్యతోపాటు సేవాగుణం అలవరుచుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ నజీరుల్లా తెలిపారు. శనివారం పట్టణ సమీపంలోని బెస్తవారిపల్లె బాలుర గురుకుల పాఠశాలలో స్నేహిత అమృతహస్తం సేవా సమితి ఆధ్వర్యంలో ×ఒత్తిడిని జయించు-ఉన్నత శిఖరాలకు చేరు₹ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వ్యాఖ్యాత శివప్రసాద్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలన్నారు. అలాగే ఏకాగ్రతపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అలాగే లింగ వివక్ష విడనాడాలని తద్వారా దేశాభివృద్ధి చెందు



మాట్లాడుతున్న ప్రముఖ వ్యాఖ్యాత శివప్రసాద్‌రెడ్డి

తుందన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ ఆఫీసర్ రామచంద్రారెడ్డి, సేవా సమితి అధ్యక్షుడు రాజు, వైస్ ప్రిన్సిపాల్ వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయులు, సేవా సమితి సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు పండిట్ దీన్‌దయాల్

వేంపల్లె : బీజేపీ సిద్ధాంతకర్త పండిట్ దీన్‌దయాల్ ఆదర్శప్రాయుడు అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాలి హరిప్రసాద్ అన్నారు. శనివారం దివంగత పండిట్ దీన్ దయాల్ వర్ధంతిని పురస్కరించుకుని వేంపల్లెలో బీజేపీ నాయకులు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. ఏకాత్మ మానవతా వాదం, అంత్యోదయను బీజేపీకి అందించిన మహనీయుడు దీన్‌దయాల్ అని పేర్కొన్నారు. అంత్యోదయం ద్వారా చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వాలు లక్ష్యంగా పనిచేయాలన్నారు. ప్రపంచ దేశాలలో అగ్రగామిగా భారత్‌ను నిలిపేందుకు మోడిగారు ఎనలేని కృషి చేస్తున్నారని.. అయినా ప్రతిపక్షాలు బురదచల్లే కార్యక్రమాలు వదల్లేదంటూ ఎంత బురద జల్లితే అంత బాగా కమలం వికసిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుష్మా, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సునీల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.


పులివెందుల టౌన్ : ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందటమే దీన్ దయాల్ లక్ష్యమని భారతీయ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి తెలి


దీన్‌దయాల్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

పారు. శనివారం బీజేపీ వ్యవస్థాపకుడు దీన్‌దయాల్ వర్ధంతిని పురస్కరించుకుని పులివెందులలో బీజేపీ నాయకులు దీన్ దీయాల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలందరికీ జాతీయత వైపు నడిపించిన గొప్ప దార్శనికుడు, దేశ భక్తుడు పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భానుప్రకాష్, చంద్రమోహన్‌రెడ్డి, రాజశేఖర్, రామచంద్రారెడ్డి, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు చేయడం తగదు

జమ్మలమడుగు : డీజీపీ(సీఐడీ) విభాగాధిపతి పి.వి.సునీల్‌కుమార్‌పై నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజు చేసిన ఆరోపణలను జమ్మలమడుగు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక నాయకులు తీవ్రంగా ఖండించారు. శనివారం పట్టణంలో స్థానిక పాతబస్టాండ్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమ సమాజ సమితి అధ్యక్షుడు గంధం బాబు, వెంకటస్వామిలు మాట్లాడుతూ బీజేపీ పార్టీకి తొత్తుగా వ్యవహరిస్తున్న నర్సాపురం పార్లమెంట్‌సభ్యులు రఘురామకృష్ణంరాజు మతాన్ని అడ్డు పెట్టుకుని దళిత అధికారిపై బురద చల్లడం మంచిది కాదన్నారు. అనంతరం ఆర్డీఓ శ్రీనివాసులుకు వారు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో మాల మహా



ఆర్డీఓ శ్రీనివాసులకు వినతిపత్రం అందిస్తున్న మైనారిటీ ఐక్యవేదిక నాయకులు

నాడు జిల్లా అధ్యక్షుడు రాజారావు సమ సమాజ సమితి ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, అవిశ శ్రీనివాసులు, నూర్‌బాషా, మహమ్మద్‌బాషా, చంద్రకుమార్, రవి, మైకేల్, సువార్తయ్యలు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మేథో వికాసం

కడప సెవెన్‌రోడ్స్ : పుస్తకాలు విరివిగా చదవడం ద్వారానే మేథో వికాసం సాధ్యపడుతుందని రిటైర్ కమాండెంట్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత రాజకిశోర్ బాబు అన్నారు. రిటైర్డ్ లెక్చరర్ దివంగత ఇమాం సాహెబ్ రాసిన సూక్తి రత్నావళి పుస్తకాన్ని శనివారం నగరంలోని దూదేకుల భవనంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత పుస్తకాలు చదివే అలవాటు చేసుకోవాలన్నారు. సెల్‌ఫోన్ మాయాజాలంలో పడి పుస్తకాలు విస్మరించడం దుష్పరిణామాలకు దారి తీసే అవకాశం ఉందన్నారు. పిల్లలు పుస్తకాలు చదివే అలవాటు చేసుకుంటే అద్భుతాలు సాధించవచ్చ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాజకిశోర్‌బాబు తదితరులు

న్నారు. ఉపాధ్యాయుడు సుబాన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఫకృద్దీన్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ మస్తాన్, జెడ్పీ రిటైర్డ్ డిప్యూటీ సీఈఓ వెంకట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు కాలనీ పరిశీలన

కడప కార్పొరేషన్: కడప నగరం రామాంజనేయపురంలోని జర్నలిస్టుకాలనీ, ఏఆర్ పోలీస్ కాలనీలను డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు పరిశీలించారు. శనివారం ఆయా కాలనీల్లో పర్యటించిన వారు స్థానికంగా ఉన్న మౌళిక వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా జర్నలిస్టుకాలనీ, ఏఆర్ పోలీస్‌కాలనీ ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు నిర్మించాలని స్థానిక ప్రజలు వారికి విజ్ఞప్తి చేశారు. కెమెరామెన్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ రెండు కాలనీల మధ్య ఉన్న 40 అడుగుల రోడ్డులో సీసీ రోడ్డు నిర్మిస్తే జగనన్న కాలనీ వాసులకు కూడా అనుకూలంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌లో సమస్యల పరిష్కారం

ఎర్రగుంట్ల : మండలంలోని నిడుజివ్వి గ్రామంలో శనివారం ఉదయం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వచ్చిన పలు సమస్యలను ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పరిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్ల ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరడంతో పాటు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించామన్నారు. వలంటీర్ వ్యవస్థను, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసి ఇంటి ముంగిటికే పథకాలు అందించే ఏర్పాటు చేశామన్నారు.


ప్రజాదర్బార్‌లో సమస్యలను ఎమ్మెల్యేకి విన్నవించు కుంటున్న ప్రజలు

నేటి నుంచి ధ్వజ శిఖర ప్రతిష్ట మహోత్సవం

దువ్వూరు : మండల పరిధిలోని మూడిండ్లపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామ ఆలయంలో ధ్వజ శిఖర ప్రతిష్ఠ మహోత్సవం ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఇందులో భాగంగా 15న ఉదయం 10 గంటలకు గ్రామోత్సవం, చండీ హోమం, 16న సీతారామలక్ష్మణ ఆంజనేయ విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ, అనంతరం సీతారాముల కల్యాణం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందని వారు వివరించారు.


మూడిండ్లపల్లెలో నూతనంగా నిర్మించిన సీతారామాలయం

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : పబ్లిక్ పరీక్షల్లో పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి సి.దేవరాజు పేర్కొన్నారు. శనివారం స్థానిక రాజబాట వీధిలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, తాళ్లమాపురం జిల్లా పరిషత్ హైస్కూళ్లను డీఈఓ సందర్శించారు. తాళ్లమాపురం జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న స్టడీ అవర్స్‌లో పాల్గొనాలని, పరీక్షల కోసం ప్రణాళిక రూపొందించుకుని సిద్ధం కావాలని పేర్కొన్నారు. 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ పాఠ్యాంశాల ఉపయోగం గురించి డీఈఓ వివరించారు. ట్యాబ్‌లను విద్యార్థులు ఉపయోగిస్తున్నారా లేదా, వాటి వల్ల ప్రయోజనం ఉందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ట్యాబ్‌లలోని పాఠ్యాంశాలను విద్యార్థులు అభ్యసించాలని సూచించారు. ఉపాధ్యాయులు ట్యాబ్‌లలోని పాఠ్యాంశాలను ఎంత శాతం బోధించింది ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.

గానబ్రహ్మ ఘంటసాలకు నివాళి

బద్వేలు అర్బన్ : సంగీత సముద్రంలో మకుటాయమానమైన గీతాలను ఎన్నింటినో తెలుగుజాతికి అందించిన గానబ్రహ్మ పద్మశ్రీ ఘంటసాలవెంకటేశ్వర్ రావు అని ఘంటసాల లలిత కళాపరిషత్ అధ్యక్షుడు, గాయకుడు ఎస్.ఎస్.దావూద్ పేర్కొన్నారు. శనివారం స్థానిక అశోక్‌నగర్‌లోని పద్మశ్రీ ఘంటసాల లలిత కళాపరిషత్ సంగీత విద్యాలయంలో అమరగాయకుడు ఘంటసాల 49వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అజరామరమైన ఘంటసాల గానామృతధారలలో అన్ని తరాల వారు తరిస్తున్నారనడానికి ప్రస్తుతం టీవీ ఛానళ్లలో వస్తున్న ఎన్నో సంగీత కార్యక్రమాలు రుజువుగా నిలుస్తున్నాయన్నారు. గాయకుడిగా, సంగీత దర్శకుడిగా ఆయన ప్రతిభ అనితరసాధ్యమైనదని, చిరస్మరణీయమైనదని కొనియాడారు.